క్లుప్తంగా

అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: వేసవిని దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నట్టు ఈఈ హరి తెలిపారు. బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె సెక్షన్ల పరిధిలో అవసరం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా లోడ్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను తనిఖీ చేయాలని లైన్‌ఇన్‌స్పెక్టర్లను ఆదేశించినట్టు పేర్కొన్నారు. వారు ఇచ్చే నివేదికను బట్టి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బోరు బావిలో కేబుల్ చోరీ



కేబుల్‌ను కట్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

ఐరాల: మండలంలోని రెడ్డివారిపల్లెలో వ్యవసాయ బోరు బావి వద్ద ఏర్పాటుచేసిన కేబుల్‌ను గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి చోరీ చేశారు. గోవిందరెడ్డిపల్లెకు చెందిన రైతు రంజిత్‌రెడ్డి గురువారం చోరీ విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోటారు నుంచి స్టార్టర్ వరకు సుమారు 100 మీటర్ల కేబుల్ కట్ చేసి ఎత్తుకెళ్లారని, కేబుల్ విలువ రూ.10 వేలు ఉంటుందని వాపోయాడు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లెలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి చిట్టిబాబు ప్రకటనలో తెలిపారు. తిమ్మోజుపల్లె రైతు భరోసా కేంద్రంలో చిత్తూరు ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నాలుగు రోజులు పంటలను ఆశించే చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు ఉచిత బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ చిత్తూరు గ్రేటర్ సభ్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ఇరువారంలో గురువారం వాసవీ క్లబ్ చిత్తూరు గ్రేటర్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. లీఫ్ సంవత్సరం సందర్భంగా 80 కుటుంబాలకు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆరూరు రామూర్తి, చంద్రశేఖర్, శ్రీధర్‌రావు, సత్యనారాయణ, లక్ష్మణ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో శుక్రవారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. వలంటీర్ల ద్వారా లబ్దిదారుల ఇంటి వద్దకే పింఛన్ల సొమ్ము అందజేస్తామని పేర్కొన్నారు. పింఛన్‌దారులు వలంటీర్లకు అందుబాటులో ఉండాలన్నారు.

సెంథిల్‌కుమార్‌కు పీహెచ్‌డీ



చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరులోని మిట్టూరుకు చెందిన సెంథిల్‌కుమార్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్నట్టు ఎస్వీ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లా నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సాంఖ్యాక శాస్త్రంలో ఆచార్య సరోజమ్మ మార్గదర్శకంలో రిగ్రెషన్ మోడల్స్ ఫర్ టైం సిరీస్ ఎనాలసిస్ అండ్ ఫోరెకాస్టింగ్ మెథడ్స్ యూసింగ్ అట్ మోస్పరిక్ డేటా అనే అంశంపై పరిశోధన చేశారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

యాదమరి: మార్చి 3వ తేదీని నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ఎంపీడీవో సింగయ్య కోరారు. ఆయన గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఉన్న చంటి పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అనీల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సహాయ కమిషనర్‌కు ఘన వీడ్కోలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో సహాయ కమిషనర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన గోవర్ధన్‌ను గురువారం పాలక వర్గం, అధికారులు ఘనంగా సన్మానించారు. ఆయనను మేయర్ అముద, కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. జ్ఞాపిక అందచేశారు. అనంతరం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన నటరాజన్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు.

చిత్తూరు రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- అమృత్‌భారత్ పథకం కింద ఎంపిక
- రూ.13.99 కోట్లతో అభివృద్ధి
- ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పన
- ఫలించిన ఎంపీ రెడ్డెప్ప కృషి



నూతన స్టేషన్ నమూనా చిత్రం



చిత్తూరు రైల్వే స్టేషన్‌లో చేస్తున్న పనులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రం చిత్తూరులోని రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. అమృత్ భారత్ పథకం కింద ఎంపికైంది. దీంతో రూ.13.99 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ స్టేషన్‌కు దాదాపు 125 ఏళ్ల చరిత్ర ఉంది. కానీ వసతులు, సదుపాయాలు లేవు. ఈ క్రమంలో ఎంపీ రెడ్డెప్ప చొరవతో చిత్తూరు రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని 17 రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ పథకం కింద ఎంపికయ్యాయి. వాటిలో చిత్తూరు రైల్వేస్టేషన్ కూడా ఉంది. దీన్ని మరో మోడల్ స్టేషన్‌గా తీర్చి దిద్దేందుకు కేంద్రం ప్రణాళికలు తయారుచేసింది. రూ.13.99 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 26వ తేదీన ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో పనులను ప్రారంభించారు. కేంద్రం ప్రతిపాదించిన సదుపాయాలను ప్రయాణికులకు కల్పించేందుకు పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి పర్యవేక్షణకు 'గతి శక్తి' పేరుతో టాస్క్‌ఫోర్స్ నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసింది. బడ్జెట్ ప్రతిపాదించిన విధంగా రాష్ట్రంలో అమృత్ భారత్ స్టేషన్లను పూర్తి స్థాయిలో అధునీకరించనున్నారు. ఇప్పటికే చిత్తూరు రైల్వేస్టేషన్‌ను పలువురు ఉన్నతాధికారులు పరిశీలించి చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన సౌకర్యాలను గుర్తించి నివేదించారు.

కల్పించనున్న సౌకర్యాలు

- ప్రస్తుతం ఉన్న భవనాన్ని పడగొట్టి దాని వెనుక (పార్కు) ముందు కొత్త భవనంను ఏర్పాటు చేయనున్నారు.
- స్టేషన్‌లో ఫ్లోరింగ్, భవనాలు ఆధునికతను చాటేలా నిర్మించనున్నారు.
- ఇప్పుడున్న ప్లాట్‌ఫాంతో పాటు అదనంగా మరో ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయనున్నారు.
- ప్రస్తుతమున్న ప్లాట్‌ఫాం పొడవును మరింత పొడిగించనున్నారు. ప్లాట్‌ఫాం వెనుక ప్రత్యేక రూఫ్ షెడ్లు ఏర్పాటు చేయనున్నారు.
- వెయిటింగ్ హాల్స్, కెఫెటీరియాలు నాణ్యమైన సేవలను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు.
- ప్రయాణికుల వాహనాలు సులభంగా వెళ్లడానికి, రావడానికి ద్వారాలను సిద్ధం చేస్తారు.
- దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రవేశ మార్గాలు, వీల్ చైర్స్, గ్రౌండ్ వాటర్ ట్యాప్ తదితర సదుపాయాలు కల్పించనున్నారు.
- మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం కొత్తగా లిఫ్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు.
- వేగవంతమైన వైఫై సేవలకు 5 జీ ఏర్పాటు చేస్తారు.
- వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ అనే నినాదాన్ని సఫలీకృతం చేస్తూ స్థానిక ఉత్పత్తుల విక్రయానికి పెద్దపీట వేస్తూ స్టేషన్‌లో కనీసం రెండు స్టాళ్లను ఏర్పాటు చేస్తారు.

వేగంగా ఆధునీకరణ పనులు

చిత్తూరు రైల్వే స్టేషన్‌ను అత్యంత సుందరంగా, అధునాతనంగా రైల్వేశాఖ తీర్చిదిద్దుతుంది. చిత్తూరు ప్రయాణికులకు మరింత సులభతరమైన, సౌకర్యవంతమైన సదుపాయాలను కల్పించేలా పనులు చేయనున్నారు. ముఖ్యంగా ఫ్లోరింగ్, పార్కింగ్, లిఫ్ట్, రూఫ్ తదితర సదుపాయాలు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

–వెంకటేష్, రైల్వే జిల్లా వాణిజ్య ఇన్‌స్పెక్టర్

వైఎస్సార్‌సీపీతోనే బడుగుల అభ్యున్నతి



శెట్టేరిలో కరపత్రాలు అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: బడుగు, బలహీన వర్గాలు బాగుపడాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం శెట్టేరి, దళితవాడ, బీసీ కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాలు, వారు పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం అంశాలను అమలు చేసినట్టు వివరించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

టీడీపీ, జనసేన నాయకుల మాటలు నమ్మొద్దు

టీడీపీ, జనసేన నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సునీల్‌కుమార్ ప్రజలకు సూచించారు. గతంలో చంద్రబాబు పాలనలో ప్రభుత్వ పథకాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలకే పరిమితమయ్యాయన్నారు. చంద్రబాబు తప్పుడు హామీలతో బడుగు, బలహీన వర్గాలను, రైతులను, మహిళలను, యువకులను మోసగించిన విషయాన్ని గుర్తుచేశారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. 2024 ఎన్నికలు సమీపించడంతో టీడీపీ, జనసేన కలిసి అధికారం కోసం కల్లబొల్లి మాటలు, హామీలు గుప్పిస్తున్నాయని తెలిపారు. వారి మోసాలకు బలికావద్దని ప్రజలకు సూచించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాలకూరు రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రఘుపతిరాజు, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎస్ఆర్‌ఐ భరత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్లు నాగరాజ, మార్కొండ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు జగదీష్‌రెడ్డి, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

బంగారుపాళెం: మండలంలోని కాటప్పగారిపల్లెలో గురువారం సాయంత్రం 64 మంది లబ్ధిదారులకు సర్పంచ్ అనసూయమ్మ అధ్యక్షతన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేస్తున్నారని తెలిపారు. అనంతరం వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఎంపీటీసీ హరి, కరుణాకర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

'మీ సేవలు మరువలేనివి'



తహసీల్దార్లను సన్మానిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న తహసీల్దార్లు ప్రసాద్‌బాబు, వెంకట్రాయులు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్, కలెక్టరేట్ యూనిట్ ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ ఎల్‌ఏ విభాగం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వెంకట్రాయులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌బాబు రెవెన్యూ శాఖలో వివిధ కేడర్లలో సేవలందించారని పేర్కొన్నారు. వారి సేవలు మరువలేనివని చెప్పారు. ఉద్యోగవిరమణ అనంతర జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. డీఆర్‌వో పుల్లయ్య మాట్లాడుతూ ఇద్దరు తహసీల్దార్లు రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేశారని తెలిపారు. డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ కరోనా సమయంలో పుంగనూరు తహసీల్దార్‌గా పనిచేసిన పి.వెంకట్రాయులు అధికారుల ఆదేశాలను పాటించి కరోనా బాధితులకు తగిన సహాయం అందించారని అభినందించారు. ప్రసాద్‌బాబు చిత్తూరు కలెక్టరేట్ ఏవోగా, పలమనేరు డీఏవోగా(డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) విశేష సేవలు అందించారని తెలిపారు. పి.వెంకట్రాయులు, ఎ.ప్రసాద్ బాబు మాట్లాడుతూ తమకు ఉన్నతాధికారులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వరన్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ హుసేన్, ఉపాధ్యక్షులు శివకుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో అనేక ప్రయోజనాలు

చిత్తూరు కార్పొరేషన్: పీఎం విశ్వకర్మ యోజన పథకంతో ప్రయోజనాలు పొందవచ్చని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ పథకం ద్వారా అందించే రుణాల్ని చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ తులసీ, డీఐసీ జిల్లా అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్హులైన వారు వీటికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్‌బాబు మాట్లాడుతూ 18 రకాల చేతి వృత్తిదారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఈ పథకం దోహదపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతిఒకరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజల ఇంటి ముంగిటే వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ప్రజల ఇంటి ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష తెలిపారు. ఆమె గురువారం శ్రీరంగంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచాన పడి ఇంటి వద్ద ఉన్న రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రిజ్వానా, అన్నపూర్ణ, శిరీష, శివగామి, శశి పాల్గొన్నారు.

నేటి విద్యాబోధన నూతన ఆవిష్కరణలకు నాంది కావాలి



మాట్లాడుతున్న పీవీకేఎన్ ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్: నేటి విద్యాబోధన నూతన ఆవిష్కరణలకు నాంది కావాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. కళాశాలలో గురువారం అధ్యాపకులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆమె మాట్లాడుతూ 2020 నూతన విద్యావిధానం ప్రకారం డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ విధానం ప్రారంభమైందని చెప్పారు. ఇకపై డిగ్రీ కళాశాలల్లో ఒక సబ్జెక్టును మాత్రమే మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని విద్యార్థులు అభ్యసించవచ్చని తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఒక సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు వృక్షశాస్త్ర అధ్యాపకులకు ఐదు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు జ్ఞానాన్ని పెంచుకుని విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి సమన్వయకర్తగా జయచంద్రుడు వ్యవహరించారు. చిత్తూరు, పీలేరు, నగరి పరిధిలోని వృక్షశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్య సేవలు



బాపినాయుడుపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూజిత

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద ప్రజలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ పూజిత తెలిపారు. వారు గురువారం మారేడుపల్లె, బాపినాయుడుపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 73 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఐరన్ మాత్రలు తప్పక వాడాలని సూచించారు.

వినాయకుని సేవలో హ్యూమన్‌రైట్స్ కమిషన్ సభ్యుడు



సుబ్రమణ్యంకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్‌రైట్స్ కమిషన్ జ్యుడిషియల్ మెంబర్ సుబ్రమణ్యం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటంతో సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పనిసరి



శివరామారావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పనిసరని ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శివరామారావు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు భేరీనాథ్ అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. డీవైఈవో చంద్రశేఖర్, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్, ఎంఈవో నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు శివరామారావు చేసిన కృషిని కొనియాడారు. విధి నిర్వాహణలో క్రమశిక్షణతో నడుచుకున్నారని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు శివరామారావు దంపతులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

ఉపాధ్యాయునికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న విజయకుమార్ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ మురళి, హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు, కనకాచారి, మదన్‌మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసన్నకుమారి

పూతలపట్టు: గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి పన్నుల వసూలుపై దృష్టిసారించాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి ఆదేశించారు. ఆమె గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎలప్పుడు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న వారికి పథకాలు అందకుంటే వలంటీర్, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ నిలిపివేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రమిస్తున్న సచివాలయ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వం చేపడుతున్న సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణను నిలిపివేయాలని వార్డు వెల్ఫేర్ సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి కోరారు. ఆ సంఘం నాయకులు గురువారం కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు విధులు అప్పజెప్పేందుకు ప్రభుత్వం జారీచేసిన జీవో నంబర్ 11ను అమలు చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహేష్, జిల్లా అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో వెలసిన కాళభైరవేశ్వర స్వామి ఆలయంలో మార్చి 6 నుంచి 12వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఉత్సవాల పోస్టర్లను గురువారం గ్రామస్తులు, ఉభయదారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, వేలు, తులసికుమార్, వినాయక, మణి, మునస్వామి మేస్త్రీ, కమలనాథం, మహేష్, కుమార్‌చౌదరి, దాము, పూజారి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న జడ్జి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్: రాజ్యాంగంలో పిల్లలకు కల్పించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. చిత్తూరులోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం 7, 8 తరగతుల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లు నేర్చుకోవాలని తెలిపారు. అప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పారు. విద్యార్థి దశ నుంచే సమాజంలో జరుగుతున్న పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచికి దగ్గరగా చెడుకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. అనంతరం ఆ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విజేతలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో–1 సెల్వరాజ్, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



సతీష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

తవణంపల్లె: వైఎస్సార్‌సీపీ తవణంపల్లె మండల ఉపాధ్యక్షుడు, సరకల్లు సర్పంచ్ సతీష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెల లీఫ్ సంవత్సరం 29వ తేదీన నాలుగేళ్లకు ఒక సారి పుట్టిన రోజు జరుపుకోవడం సంతోషంగా ఉందని సతీష్ రెడ్డి తెలిపారు. ఆయనకు పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ సర్పంచ్ డాక్టర్ సునీల్‌కుమార్, అర్ధగిరి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి, పారిశ్రామికవేత్త, యాదమరి వైఎస్సార్ సీపీ నాయకులు మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ కుమార్‌రాజా, తవణంపల్లె, పూతలపట్టు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

చిత్తూరు అర్బన్: మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ సీఎస్ శ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భవనాలతో పాటు ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ కానున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు బకాయి పడ్డ ఆస్తి పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లించిన వారికి మాత్రమే వడ్డీ మాఫీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు చివరి రోజు వరకు కాకుండా శుక్రవారం నుంచే వడ్డీ లేకుండా ఆస్తి పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ తెలిపారు.

అధికారులు ఎన్నికల నియమావళి పాటించాలి

గంగాధర నెల్లూరు: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఈవీఎంల పనితీరు, ఎదురయ్యే సమస్యలు, పరిష్కరించే విధానాలపై పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులు, తహసీల్దారులకు ఎలక్షన్ డీటీ విజయకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారులు సుబ్బలక్ష్మమ్మ, సుభద్రమ్మ, పుష్పకుమారి, ఆనందమోహన్ పాల్గొన్నారు.